సాక్షి
శ్రీకాకుళం
గురువారం, 16, నవంబర్, 2023



కులగణనకు శ్రీకారం

కుల గణనకు అంకురార్పణ జరిగింది. గార మండలం రామచంద్రాపురంలో గణన జరిగింది.

- 8లో



పట్టపగలే చోరీ

కొత్తూరు మండలంలో పట్టపగలే చోరీ జరిగింది. నాలుగు తులాల బంగారం దొంగిలించారు.

- 8లో

నేడు జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్-19 జూనియర్స్ బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ టెన్త్‌క్లాస్ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఎంపికలకు హాజరై సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ ఈశ్వరరావు (సెల్: 94937 64447)ను సంప్రదించాలని కోరారు.

వంశధార తీరంలో సామాజిక చైతన్య హోరు

ఓ వైపు ముమ్మరంగా వరి కోతలు.. ఇంకోవైపు ఉత్సాహంగా వరల్డ్ కప్ సెమీస్ మ్యాచ్. అయినా జనం వైఎస్సార్ సీపీ జెండా పట్టుకున్నారు. మేలు చేసిన ప్రభుత్వానికి మద్దతు తెలిపేందుకు సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చారు. దారి పొడవునా నిలుచుని వైఎస్సార్ సీపీ రథానికి హారతులిచ్చి స్వాగతం పలికారు. జనం చూపిన అభిమానంతో నరసన్నపేట మురిసిపోయింది. జై జగన్ నినాదాలు విని ఉప్పొంగిపోయింది. వంశధారకు సరిసమానంగా జన ప్రవాహం కదిలింది.

- జనసంద్రంగా మారిన నరసన్నపేట
- వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్రకు బ్రహ్మరథం
- ఉద్వేగంగా నాయకుల ప్రసంగాలు



నరసన్నపేటలో బహిరంగ సభకు హాజరైన జన సందోహంలో ఒక భాగం



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్. చిత్రంలో స్పీకర్, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : నరసన్నపేటలో బుధవారం జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర జనంలో ఆ పార్టీపై ఉన్న అభిమానానికి నిదర్శనంగా సాగింది. కోతలు, క్రికెట్ మ్యాచ్‌లను వదలుకుని మరీ జనం తండోపతండాలుగా యాత్రకు, బహిరంగ సభకు కదలివచ్చారు. జనాభిమానంతో వంశధార ఒడ్డున సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. మబగాంలో ప్రెస్‌మీట్ అనంతరం బస్సు యాత్రను పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అక్కడి నుంచి కిల్లాం, ఈదులవలస, ఈదులవలస జంక్షన్, సల్లబంద జంక్షన్, దేశవానిపేట, పల్లిపేట జంక్షన్ మీదుగా బస్సు యాత్ర సాగింది. దాదాపు 10 కిలోమీటర్ల సాగిన బస్సు యాత్ర సాయంత్రం 4 గంటల సమయంలో నరసన్నపేటకు చేరుకుంది. తొలుత వైఎస్సార్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, అనంతరం బహిరంగ సభలో నేతలు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమైన బస్సు యాత్ర 4 గంటల సమయానికి నరసన్నపేటకు చేరుకుంది. ఈ క్రమంలో దారి పొడవునా జనం నీరాజనం పలికారు. ఎక్కడికక్కడ బారులు తీరుతూ బస్సు యాత్రకు స్వాగతం పలికారు. బస్సు యాత్రకు ముందు పోలాకి, నరసన్నపేట మండలాలకు చెందిన వందలాది మంది భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నేతల రాకకోసం ఏర్పాటు చేసిన పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బెలూన్లతో నరసన్నపేటలో పండగ వాతావరణం నెలకొంది. సుమారు రెండు గంటల పాటు జరిగిన సభకు వచ్చిన జనం ప్రసంగాలను ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, పాముల పుష్ప శ్రీవాణి, యువకుడు ధర్మాన కృష్ణ చైతన్య తమ ప్రసంగాలతో అదరగొట్టారు.



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, వరుదు కళ్యాణి, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, విశ్వసరాయి కళావతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, సమన్వయకర్తలు పిరియా సాయిరాజ్, దువ్వాడ వాణి, కార్పొరేషన్ చైర్మన్లు పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పి.కృష్ణవేణి, రాజాపు అప్పన్న హైమావతి, పి.సుజాత, సుజాత, అనూష పట్నాయక్, దుక్క లోకేశ్వరరెడ్డి, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సుడా చైర్మన్ కోరాడ ఆశలత, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్మన్ పిలక రాజ్యలక్ష్మి, పార్టీ నాయకులు ధర్మాన రాందాస్, ధర్మాన కృష్ణ చైతన్య, నిమ్మన దాసు, జేఏసీ చైర్మన్ లజపతిరాయ్, పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బెందాళం పద్మావతి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, వైఎస్సార్‌సీపీ నాయకులు డోల జగన్, ఇప్పిలి కృష్ణారావు, ఎన్ని ధనుంజయ్, అంబటి శ్రీను, గొండు రఘురాం, బల్లాడ జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల నోట.. సంక్షేమం మాట

జగన్ మా పాలిట దేవుడు



ఏ దిక్కూ లేని మాలాంటి వృద్ధులకు మొదటి తేదీకే ఠంచనుగా పింఛన్ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మా పాలిట దేవుడు. నెలవారీ మందులు, మా ఇతర ఖర్చులకు ఎవరి మీదా ఆధార పడకుండా వలంటీర్ ద్వారా ఇంటికే తెచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు.

– గోరు సత్యనారాయణ, వృద్ధుడు, శివనగర్ కోలనీ, నరసన్నపేట

మమ్మల్ని గుర్తించారు



చేనేత కార్మికులను ఎవరూ పట్టించుకోలేదు. పాదయాత్రలో మా కష్టాలు విని మా కోసం ఏటా నిధులు వెచ్చిస్తున్న నాయకుడు వైఎస్ జగన్. మళ్లీ ఆయనే సీఎం కావాలి. – కాశిన మల్లేశ్వరరావు, చేనేత కార్మికుడు, దేశవానిపేట, నరసన్నపేట

సీఎం చేయూతనిచ్చారు



చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18వేలు అందిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ఆ సొమ్ము కుటుంబ పోషణకు, ఆర్థికంగా వృద్ధి చెందేందుకు మహిళలకు ఎంతో తోడ్పాటునిస్తోంది.

– అంబటి కుమారి, చేయూత లబ్ధిదారు, పురుషోత్తమనగర్ కాలనీ, నరసన్నపేట.



నాయకులకు టాటా చెబుతూ..

అమ్మ ఒడితో ఆసరా



అమ్మ ఒడి డబ్బులు నాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. నా పిల్లల చదువుపై ఇంత శ్రద్ధ తీసుకుంటున్న నాయకుడి మేలు ఎన్నటికీ మర్చిపోలేం. ఇప్పుడు నా పిల్లలను ఉన్నత చదువులు చదివించగలననే నమ్మకం వచ్చింది.

– సిరిపురం పద్మ, అమ్మఒడి లబ్ధిదారు, పోలాకి

అన్నదాతలకు భరోసా మా జగన్

రాష్ట్రంలో నాలాంటి ఎంతోమంది అన్నదాతలకు సీఎం వైఎస్ జగన్ భరోసాగా నిలిచారు. రైతు భరోసా సొమ్ముతో ఏటా వడ్డీల బాధ తగ్గింది. కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం అందిస్తున్నారు. – ఎం.సుందరరావు, కిడిమి, సారవకోట మండలం.



బైక్ ర్యాలీలో ఉత్సాహంగా శ్రేణులు

జగనన్న పాలనలో సామాజిక న్యాయం



వైఎస్ జగన్ పాలనలో సామాజిక న్యాయం జరుగుతోంది. టీడీపీ చేయలేని పనులు వైఎస్ జగన్ చేసి చూపించారు. పద్నాలుగేళ్లు పాలించిన చంద్రబాబు కంటే ఒక్క ఏడాదిలోనే అధిక సంఖ్యలో సచివాలయ ఉద్యోగాలను సృష్టించి ఇచ్చారు. వైఎస్ జగన్ పాలనకు ఇది నిదర్శనం. ధరల పెరుగుదలపై మాట్లాడుతున్న ప్రతిపక్షాలు ఏ రాష్ట్రంలో ధరలు తక్కువగా ఉన్నాయో కూడా చెప్పాలి. ఇలాంటి బూటకపు ప్రచారాలను జనమే నిలదీయాలి. 2019 కంటే ముందు గ్రామాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి, ఇప్పుడెలా ఉన్నాయో బేరీజు వేసుకుని చూసుకోవాలి. నాడు-నేడు బడులు, ఆస్పత్రులు, సచివాలయాలు, ఆర్బీకేలు మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయి.

– ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ మంత్రి

విపక్షాల తీరు హేయం



రాష్ట్రంలో అభివృద్ధి గురించి కేంద్ర సంస్థలు కూడా ప్రశంసిస్తుంటే టీడీపీ ఇంకా జనాలను మభ్య పెట్టాలని చూస్తోంది. ఎల్లో మీడియా తీరు కూడా హేయం. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో అన్ని వర్గాల జీవన ప్రమాణాలు పెరిగాయి. వ్యవసాయం దండగ నుంచి వ్యవసాయం ఒక పండగలా మారింది. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోంది. విశాఖ రాజధానిగా ప్రభుత్వం నిర్ణయిస్తే విపక్షాలు అడ్డుకుంటున్నాయి. అమరావతి రాజధానిని కోరుకోవటంలో చంద్రబాబు అండ్ కో స్వార్థం నిండి ఉంది.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

చంద్రబాబు ఏం చేశారు..?



సామాజికంగా, ఆర్థికంగా, ప్రాంతీయంగా వెనుకబాటుకు గురైన శ్రీకాకుళం జిల్లాలో చంద్రబాబు ఏనాడైనా ఒక్క కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినా పెట్టగలిగారా.? నాలుగున్నరేళ్ల కాలంలో జిల్లా రూపురేఖలు మార్చిన జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జిల్లా ప్రజలు కోరుకోవటంలో తప్పేముంది. ఉద్దానం కిడ్నీ సమస్యలను పాదయాత్రలో చూసి చలించిపోయిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశారు. వంశధార నీరు అందించేందుకు అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే చర్యలు తీసుకున్నారు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

సామాజిక న్యాయం జరిగింది



వైఎస్ జగన్ రాకపోయినా సామాజిక సాధికార యాత్రలకు జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. సామాజిక న్యాయం జరగడమే దీనికి కారణం. తొమ్మిదిన్నరేళ్లు ఎంపీగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు కొన్ని రైల్వే స్టేషన్లలో స్టీల్ బెంచీలు వేయడం తప్ప ఇంకేమీ చేయలేదు. విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సంస్థల్లో ఒక్కదాన్నైనా జిల్లాకు తీసుకురాగలిగారా..? టీడీపీ కంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఉద్దానంకు తాగునీరు, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వంశధార ఎత్తిపోతల పథకం వంటివి వచ్చాయి.

– సీదిరి అప్పలరాజు, మత్స్యశాఖ మంత్రి

సంక్షేమం అమలులో దేశానికే ఆదర్శం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రాష్ట్రంలో విపక్షం ప్రజా సమస్యలపై పోరాడకుండా అపహాస్యమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన మేలును వివరిస్తూ నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర తొలివిడత 35 నియోజకవర్గాల్లో దిగ్విజయంగా సాగిందని అన్నారు. మబగాంలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజలకు సంక్షేమం అందించడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. నాలుగున్నరేళ్లలో రూ.2.35 లక్షలకోట్లు డీబీటీ పద్ధతిలో ప్రజలకు అందించామని చెప్పారు. బీసీలు అంటే బ్యాక్‌బోన్ అని చెప్పినట్టుగానే 139 కులాలతో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రహదారులు వంటి అనేక క్షేత్రస్థాయి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు, కిడ్నీరోగులకు రీసెర్చ్ సెంటర్, మూలపేట పోర్టు, వంశధార ఎత్తిపోతల పథకం, తీరం వెంబడి ఫిషింగ్ జెట్టీలు ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు శ్రీకాకుళం జిల్లా ప్రజల ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు వ్యవసాయంపై అవగాహన లేదని, ఆయన కేవలం ప్రసంగాలకే పరిమితమైన నాయకుడని కృష్ణదాస్ చురకలు అంటించారు. వ్యవసాయానికి తాము ఏం చేశామో చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని, అచ్చెన్నాయుడు గానీ ఎంపీ గానీ తమ హయాంలో చేసిందేమిటో చెప్పలగరా అని ప్రశ్నించారు.



మబగాంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ వైఎస్ జగన్ సీఎం అయ్యాక జిల్లా రూపురేఖలే మారిపోయాయని చెప్పారు. 1955 నుంచి కొనసాగుతున్న వంశధార సమస్యలపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో నేరుగా సమావేశమైన తొలి ముఖ్యమంత్రి జగన్ అని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి ఇంకో 30 ఏళ్ల పాటు జగన్ సీఎంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డీసీసీబీ చైర్మెన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గంలో 1.41లక్షల మందికి డీబీటీ ద్వారా రూ.1144 కోట్లు అందించారని, నాన్ డీబీటీ పద్ధతిలో 1.03 లక్షల మందికి రూ.224 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. రాష్ట్ర కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన 100 శాతం హామీలు అమలుచేసిన నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు, పార్టీ నాయకులు ధర్మాన రాందా స్, డోల జగన్, పిలక రాజ్యలక్ష్మి, రాజాపు హైమావతి, బెందాళం పద్మావతి, ఇప్పిలి కృష్ణారావు, ఎన్ని ధనుంజయరావు, సదాశివుని కృష్ణ పాల్గొన్నారు.



వంగపండు ఉష పాటలకు చిందులేస్తున్న వృద్ధుడు

ఇది చేతల ప్రభుత్వం



ఎన్నో దశాబ్దాలుగా ఎన్నో పార్టీలు బడుగుల కోసం ప్రసంగాలు చేశాయి. కానీ చేతలు చేసి చూపించింది వైఎస్సార్ సీపీ ఒక్కటే. పార్టీ, వర్గం, కుల, మతం భేదం లేకుండా సంక్షేమం అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే. 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తాం. శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు, ఉద్దానం ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కపైసా లంచం లేకుండా కోట్ల రూపాయలు లబ్ధిదారులకు అందజేశారు.

– పాముల పుష్ప శ్రీవాణి, కురుపాం ఎమ్మెల్యే



బస్సు యాత్ర

సైడ్‌లైట్స్

- మబగాం గ్రామం మొదలు ప్రతి జంక్షన్ వద్ద మహిళలు పెద్ద ఎత్తున హారతులు ఇచ్చారు.
- ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సతీమణి పద్మప్రియ బస్‌యాత్రకు హారతి ఇచ్చారు.
- కిల్లాం గ్రామంలో అభిమానులు పూలవాన కురిపించారు.
- నరసన్నపేటలోకి ప్రవేశించగానే కోలాట నృత్యాలు, సత్యంవరం గ్రామం తప్పెటగుళ్లతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- జై జగన్ పాటలు మార్మోగిపోయాయి.
- నమ్మం బాబు పాట హైలెట్‌గా నిలిచింది. నిన్ను నమ్మం బాబు..నీ మాటలన్నీ బూటకం అనే పాటలకు పలువురు నృత్యాలు చేశారు.

– నరసన్నపేట/ సారవకోట/ పోలాకి/ జలుమూరు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి నాయకుల నివాళి



బస్సు పై పూలు జల్లుతున్న మహిళలు

క్లుప్తంగా

భూసేకరణ యూనిట్‌-4 కొనసాగించాలని వినతి



మంత్రి ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

శ్రీకాకుళం రూరల్‌: జిల్లాలోని ఆమదాలవలసలో కొనసాగుతున్న భూసేకరణ యూనిట్‌-4ను కొనసాగించాలంటూ ఏపీ రెవెన్యూ సర్వీసెస్‌ అసోసియేషన్‌ ఉద్యోగుల సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. మొత్తం నాలుగు యూనిట్లకు గాను 2022 మేలో కొన్నింటిని రద్దు చేశారని, ప్రస్తుతం వంశధార భూసేకరణ యూనిట్‌-4 మాత్రమే కొనసాగుతోందని, ఇది కూడా ఈ ఏడాది డిసెంబర్‌ 31 నాటికి పూర్తి కానుందని వివరించారు. దీనిని కూడా రద్దు చేస్తే యూనిట్‌లో చేయాల్సిన భూ సేకరణ విస్తీర్ణ పనులు, కోర్టు కేసులు, బాధితులకు పంపిణీ చేయాల్సిన నగదు పెండింగ్‌లో ఉండిపోతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బీఆర్‌ఆర్‌ వంశధార భూసేకరణ యూనిట్‌-4ను కొనసాగిస్తూ, యూనిట్‌ 3ను పునరిద్ధరించాలని విన్నవించారు.

నాలుగు రోజుల్లో 52 కేసులు

అరసవల్లి: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అక్రమ విద్యుత్‌ వినియోగాలపై విజిలెన్స్‌ అధికారులు దాడులు నిర్వహించారు. నాలుగు రోజులుగా పలు ప్రాంతాల్లో తూర్పు ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ విభాగమైన డీపీఈ సిబ్బందితో కలిసి ఏపీటీఎస్‌ సిబ్బంది సమన్వయంగా జరిపిన దాడుల్లో ఏకంగా 52 కేసులు నమోదయ్యాయని విజిలెన్స్‌ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఈ నెల 2న 16, 8వ తేదీన 16, 15న 20 చొప్పున కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు.

ముగిసిన ఐటీఈపీ దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ప్రారంభిస్తున్న ఐటీఈపీ కోర్సు దరఖాస్తుల స్వీకరణ బుధవారంతో ముగిసింది. నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ నిర్వహించిన ఎన్‌సీఈటీ -2023 పరీక్షలో అర్హత పొందిన వారు దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్‌ మేరకు వచ్చిన దరఖాస్తుల్లో టెస్టు మార్కులు స్కోర్‌, రిజర్వేషన్‌ రోస్టర్‌ ఆధారంగా గురువారం మెరిట్‌ లిస్టు ప్రకటించనున్నారు. ఎంపికైన విద్యార్థుల నుంచి 17, 18 తేదీల్లో ఫీజులు స్వీకరించి ప్రవేశాలు కల్పిస్తారు. 20న మిగులు సీట్లు ప్రకటిస్తారు. 21న రెండో విడత ప్రవేశాలు కల్పిస్తారు. 22న రెండో కౌన్సెలింగ్‌ విద్యార్థుల నుంచి ఫీజులు స్వీకరించనున్నారు. 23న ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వసతి గృహం సీట్లు కేటాయిస్తారు. 23 నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

కొండలపై కెమెరాలు



జీడిపేట సమీపంలో కెమేరాలు ఏర్పాటు చేస్తున్న అటవిశాఖాధికారులు.

టెక్కలి రూరల్‌: మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధిలో జక్కరపేట, జీడిపేట గ్రామ సమీప కొండలపై పులి సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీ శాఖాధికారులు దాని ఉనికిని గుర్తించేందుకు కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా జీడిపేట సమీపంలో జీడిరాయిల మెట్ట వద్ద కొలనకు ఆనుకుని మూడు కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ రేంజర్‌ జగదీశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

కులగణనకు శ్రీకారం

- గార మండలం రామచంద్రాపురంలో పైలట్‌ ప్రోగ్రాంగా ప్రారంభం
- 27 నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- ఇప్పటికే 151 కులాల గుర్తింపు



రామచంద్రాపురంలో పైలట్‌ ప్రోగ్రాం కింద కులగణన నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన బుధవారం ప్రారంభమైంది. పైలట్‌ ప్రోగ్రాం కింద జిల్లాలో గార మండలం రామచంద్రాపురంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో గుర్తించిన లోపాలను సవరించి ఈ నెల 27 నుంచి జిల్లా వ్యాప్తంగా కులగణన చేపట్టనున్నారు. జిల్లాకు సంబంధించి ఇప్పటికే 151 కులాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. నాటి బ్రిటీష్‌ ప్రభుత్వ హయాంలో 1931లో కులగణన జరిగింది. తర్వాత ఇంతవరకు కులగణన చేయలేదు. వివిధ రకాల సర్వేలు, లెక్కలు చేసినప్పటికీ ఉప కులాలు, కులాల పేర్లతో గణన నిర్వహించలేదు. కేవలం బీసీ, ఓసీ, ఎస్సీ, ఎస్టీ ఇలా మాత్రమే గణన చేశారు. ఈసారి కులం పేరిట గణన చేస్తుండటం గమనార్హం.

ప్రత్యేక యాప్‌లో నమోదు..

ఈ సారి కులగణనను గ్రామ, వార్డు సిబ్బంది నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రతి ఇంటి డేటా యాప్‌లో ముందుగానే పొందుపర్చి ఉంటుంది. వాటిని సరిచేసుకుని కుటుంబ పెద్ద ఆమోదించాల్సి ఉంటుంది. మొదటి దశలో ఇల్లు, భూములు, ఇతర వివరాలు, రెండో దశలో కులం, ఉప కులం, మతం, ఇతర వివరాలను ధ్రువీకరించాల్సి ఉంటుంది.

వారం రోజుల పాటు గణన

జిల్లాలో ఈ నెల 27 నుంచి ప్రారంభించి వారం లోపు గణన పూర్తి చేస్తారు. మరో పది రోజులు పాటు గ్రేస్‌ పీరియడ్‌ ఇస్తున్నారు. డోర్‌లాక్‌, వలసలు, వివిధ కారణాల వల్ల స్థానికంగా అందుబాటులో లేని వారి వివరాల్లో ఆ పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. 2016లో జరిగిన సర్వే ఆధారంగా ఇంటి నంబర్లు, సభ్యుల సంఖ్య ఉంటాయి. వాటిలో తొలగింపులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు ఉంది.

కో ఆర్డినేటర్‌గా గణాంకాధికారి..

ఈసారి గణాంక శాఖ, బీసీ సంక్షేమ శాఖ, గ్రామ వార్డు సచివాలయాలు ఉమ్మడిగా సర్వే నిర్వహిస్తున్నాయి. సచివాలయ విభాగాధికారి పి.వాసుదేవరావు ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వేకు కోఆర్డినేటర్‌గా ప్రణాళికా శాఖ జేడీ ప్రసన్నలక్ష్మి, బీసీ గణనకు కావాల్సిన సహకారం, వారిలో చైతన్యం కల్పించే బాధ్యతను బీసీ సంక్షేమాధికారి అనురాధకు అప్పగించారు.

17న రౌండ్‌ టేబుల్‌ సమావేశం..

జిల్లాలో బీసీ కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు ఇతర వర్గాలతో ఈ నెల 17న శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో బృందావన హోటల్లో రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరగనుంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆయా కుల సంఘాల ప్రతినిధులకు సమాచారం అందజేశారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకే..

జిల్లావ్యాప్తంగా నవంబర్‌ 27 నుంచి కులగణన ప్రారంభిస్తామని కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ బుధవారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌ ప్రకటించారు. కుల గణన తర్వాత ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. గణన పూర్తయ్యాక సచివాలయ పరిధిలో 10 శాతం ఇళ్లల్లో రీ వెరిఫికేషన్‌ చేసి గణన వివరాలను సరిపోల్చుతామని చెప్పారు. గ్రామ, మండల, డివిజనల్‌, జిల్లా స్థాయి అధికారులకు ఈ నెల 20 నుంచి 22 వరకు శిక్షణలు ఉంటాయని కలెక్టర్‌ తెలిపారు.

దాశరథీపురంలో పట్టపగలే చోరీ

- నాలుగు తులాల బంగారం, రూ.50 వేలు అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు : గ్రామంలో పెద్దలంతా పొలం పనులకు వెళ్లిపోయారు.. పిల్లలు పాఠశాలకు వెళ్లారు.. గ్రామం నిర్మానుష్యంగా ఉంది.. ఇదే అదునుగా దుండగులు ఓ ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు, నగదు పట్టుకుపోయారు. ఈ ఘటన కొత్తూరు మండలం దాశరథీపురంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాశరథీపురం గ్రామానికి చెందిన గేదెల తవిటి నాయుడు, భార్య పద్మాలు ఎప్పటిలాగే బుధవారం ఉదయం 8 గంటల సమయంలో వరి చేలు కోసేందుకు పొలానికి వెళ్లారు. తవిటినాయుడు అయ్యప్ప మాలధారణలో ఉన్నందున సన్నిధానానికి వెళ్లేందుకు ఉదయం 11 గంటల సమయంలో పొలం నుంచి ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగలుగొట్టడం గమనించి లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలు గొట్టి ఉన్నాయి. దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆర్‌.వేణుగోపాలరావు పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్‌ టీమ్‌ వేలిముద్రలు సేకరించారు. బంగారంతో పాటు అంబలం పూజ కోసం అప్పు చేసి దాచుకున్న నగదు సైతం చోరీకి గురైనట్లు తవిటినాయుడు వాపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ధర్మారావు చెప్పారు.

భవిష్యత్‌ అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్‌



వర్కు షాపులో పాల్గొన్న విద్యారంగ నిపుణులు

ఎచ్చెర్ల క్యాంపస్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ప్రారంభిస్తున్న నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యాకోర్సు (ఐటీఈపీ)లో భవిష్యత్‌ అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్‌ రూపొందిస్తున్నట్లు న్యూఢిల్లీకి చెందిన జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి సభ్యులు ఘంటా రమేష్‌ అన్నారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో బుధవారం రెండో రోజు కరిక్యులమ్‌ డిజైన్‌ వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం నేపథ్యంలో ఐటీఈపీ కోర్సుకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. దేశంలో కొన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రారంభిస్తున్న ఈ కోర్సుకు ఈ ఏడాది బీఆర్‌ఏయూలో శ్రీకారం చుట్టడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ఎంపీసీ, హెచ్‌ఈపీ డిగ్రీతో పాటు బీఎడ్‌ అర్హత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన స్టేట్‌ రిసోర్సు సెంటర్‌ పూర్వపు డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఎస్‌.పద్మనాభయ్య, విద్యావేత్తలు బీఎస్‌ పాండే, డి.రామకృష్ణయ్య, విజయవర్ధని తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అండర్‌-19 అథ్లెటిక్స్‌ ఎంపికలు



లాంగ్‌జంప్‌లో ఓ అథ్లెట్‌ విన్యాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్‌ అండర్‌-19 బాలబాలికల అథ్లెటిక్స్‌ ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం మైదానం వేదికగా బుధవారం జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రన్స్‌, త్రోస్‌, జంప్స్‌ విభాగాల్లో ప్రతిభ నిరూపించుకున్నారు. మెరుగైన ట్రాక్‌ రికార్డులను కలిగిన క్రీడాకారుల వివరాలను నమోదు చేసుకున్నారు. తుది జాబితాను త్వరలో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, చంద్రశేఖర్‌, ఆనంద్‌కిరణ్‌, సన్నిబాబు, పీడీలు, సీనియర్‌ క్రీడాకారులు పాల్గొన్నారు.

భౌగోళిక సమాచార వ్యవస్థతో మేలు



సీఎస్‌ఎల్వీ రాకెట్‌ నమూనాను ప్రదర్శిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: భౌగోళిక సమాచార వ్యవస్థతో నిత్య జీవితంలో ఎంతో మేలు జరుగుతుందని భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థకు చెందిన డాక్టర్‌ పి.ఎస్‌.ఆర్‌.శ్రీనివాస శాస్త్రి అన్నారు. స్థానిక ఆర్‌.సీతాపురం సెంచూరియన్‌ వర్సిటీ క్యాంపస్‌ ఆడిటోరియంలో అంతర్జాతీయ భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌగోళిక సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వం శాటిలైట్‌ వ్యవస్థను కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కృత్రిమ మేథస్సు, నీటి వనరుల వినియోగం, అర్బన్‌ ప్లానింగ్‌, పర్యావరణం ఎలా కాపాడుకోవాలి, వ్యవసాయం మరియు ఇతర అనుబంధ సైన్సులు, విపత్తుల నివారణ నిర్వహణ, మెషిన్‌ లెర్నింగ్‌, సాంకేతిక పరిజ్ఞానం వంటి విషయాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు, ఫ్యాకల్టీల నుంచి 282 పరిశోధన పేపర్లు అందగా, వాటిలో 169 ఎంపిక చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వైజ్ఞానికుడు డా.పి.రాజా, సెంచూరియన్‌ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్‌.రావు, రిజిస్ట్రార్‌ డా.సుప్రియా పట్నాయిక్‌, డీన్‌ డా.అనితాపాత్రో, డా.ఆశిష్‌ రంజన్‌ దాస్‌, ప్రోగ్రాం కన్వీనర్‌ ప్రొ.ప్రఫుల్ల కుమార్‌ పండా, డాక్టర్‌ గిరీష్‌ చంద్ర కోఠయారి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్‌: పెన్షనర్ల సమస్యలపై స్టేట్‌ గవర్నమెంట్‌ పెన్షనర్ల అసోసియేషన్‌ నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో బుధవారం పెన్షనర్ల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఎస్‌జీపీఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌.శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్‌.రామచంద్రరావు, కార్యదర్శి డి.ధర్మారావు, ట్రెజరర్‌ బి.మోహనరావు, అప్పారావు, పొందూరు సెక్రటరీ సూర్యప్రకాశరావు, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ పి.శాంతారావు, గౌరీకాంతారావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

పెండింగ్‌ దరఖాస్తులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: పెండింగ్‌ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్టోరల్స్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 18,28,410 మంది ఎలక్టోరల్స్‌ ఉన్నట్లు వివరించారు. శాసనసభా నియోజకవర్గాలలో ఈ నెల 8 నుంచి 13 వరకు 14,154 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. చేర్పులకు ఇప్పటి వరకు 18,531, తొలగింపులకు 6,409, దిద్దుబాటుకు 12,133 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఎక్కువ పెండింగ్‌ ఉన్న మండల తహసీల్దార్లకు షోకాజ్‌ నోటీసులు జారీ చేయాలన్నారు. మొగదాలపాడులో పోలింగ్‌ కేంద్రం మార్పు అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రౌతు శంకరరావు(వైఎస్సార్‌ సీపీ), కె.వి.రామరాజు(టీడీపీ), డి.గోవింద మల్లిబాబు(కాంగ్రెస్‌), బి.నారాయణరావు(బీఎస్పీ), సి సెక్షన్‌ సూపరింటెండెంట్‌ ప్రకాశరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్‌ కంపెనీ ఉద్యోగి మోసంపై ఫిర్యాదు

టెక్కలి రూరల్‌: శ్రీరాం ఫైనాన్స్‌ టెక్కలి బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఉపేంద్ర అనే ఉద్యోగి పలువురు ఖాతాదారుల సొమ్ముతో పరారయ్యాడు. ఈ మేరకు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. తాజాగా రుణ చెల్లింపు విషయంలో పలువురు ఖాతాదారులకు సంస్థ నుంచి నోటీసులు అందడంతో పలాస మండలం అంతరకుద్ర ప్రాంతం నుంచి ఓ మహిళ, టెక్కలి మండలం అక్కవరం గ్రామానికి చెందిన కె.శ్రీరాములు అనే వ్యక్తి బుధవారం టెక్కలి బ్రాంచికి వెళ్లి సిబ్బందిని నిలదీశారు. గతంలో తాము తీసుకున్న రుణాన్ని పూర్తిగా కట్టినా మళ్లీ చెల్లించాలని నోటీసులు ఎందుకు పంపించారని ప్రశ్నించారు. తమ అనుమతి లేకుండా సంతకాలు ఫోర్జరీ చేసి లోన్‌ పెట్టినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సైబర్‌ వలలో ప్రైవేటు ఉద్యోగి

- రూ.4 లక్షలు కాజేసిన మోసగాళ్లు

టెక్కలి రూరల్‌: చిరుద్యోగులు, ప్రైవేట్‌ కంపెనీ ఉద్యోగులు, యువతను లక్ష్యంగా చేసుకుని సైబర్‌ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ రంగాపురం గ్రామానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి సైబర్‌ మోసానికి గురయ్యాడు. పెద్దింటి శ్రీనివాసరావు అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవలే గ్రామానికి వచ్చారు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో రోజుకు మూడు నాలుగు గంటలు పనిచేస్తే వేలల్లో డబ్బులు వస్తాయని ఈ నెల 11న మెసేజ్‌ రావడంతో లింక్‌ డౌన్‌లోడ్‌ చేసుకున్నాడు. వారు ఇచ్చిన పని చెయ్యడంతో పెట్టుబడికి కొంత మొత్తం కలిపి యాప్‌లో జమ చేశారు. ఆ డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో వారు చెప్పినట్లు ఈ నెల 11, 12 తేదీ రూ.4లక్షలు వరకు జమ చేశాడు. చివరకు సైబర్‌ మోసానికి గురైనట్లు గుర్తించి బుధవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌ పోటీల్లో తేజేశ్వరికి రజతం



బాక్సింగ్‌ కోచ్‌ పురుషోత్తంతో కుందాల తేజేశ్వరి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర సీనియర్స్‌ బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో జిల్లాకు చెందిన కుంచాల తేజేశ్వరి రజత పతకం సాధించి శభాష్‌ అనిపించింది. విశాఖపట్నం వేదికగా ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగిన పోటీల్లో తేజేశ్వరి 58-63.5 కేజీల విభాగంలో రాణించింది. ఈమె శ్రీకాకుళం పీఎస్‌ఎన్‌ఎం హైస్కూల్‌ వేదికగా మాస్టర్‌ మైండ్స్‌ వారియర్స్‌ బాక్సింగ్‌ క్లబ్‌లో మాజీ సైనికుడు, బాక్సింగ్‌ కోచ్‌ కె.పురుషోత్తం వద్ద శిక్షణ పొందుతుంది. స్వస్థలం ఆమదాలవలస మండలం సిలగాం సింగువలస. తల్లిదండ్రులు రామారావు, లక్ష్మిలు వ్యవసాయం చేస్తుంటారు. తేజేశ్వరి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. తేజేశ్వరిని కోచ్‌తో పాటు క్లబ్‌ అధ్యక్షుడు టి.తారకనాథ్‌, కార్యదర్శి బి.సురేష్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.సురేఖ, బాక్సింగ్‌ సంఘ ప్రతినిధులు, సీనియర్‌ క్రీడాకారులు అభినందించారు.

అట్టాడకు తెలుగు యూనివర్సిటీ పురస్కారం



అవార్డు అందుకుంటున్న అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్‌:

ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు బుధవారం తెలుగు యూనివర్సిటీ పురస్కారం అందుకున్నారు. అప్పలనాయుడు రచించిన బహుళ నవలకు గాను ఈ అవార్డు వరించింది. వర్సిటీ రిజిస్ట్రార్‌ వి.సి.కిషన్‌రావు, కవి, జర్నలిస్టు అల్లం నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

గిరిజన సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్‌ సీదిరి అప్పలరాజు



ఆకట్టుకున్న గిరిజన చిన్నారుల నృత్యాలు

మందస: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్‌ సీదిరి అప్పలరాజు అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సాముండా 149వ జయంతి సందర్భంగా మందస మండలం కుంటికోట సమీపంలోని గిరిజన యూత్‌ శిక్షణ కేంద్రంలో బుధవారం జనజాతర గౌరవ్‌ దివస్‌, వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర గిరిజనయాత్ర స్వాభిమాన్‌ ఉత్సవాలు) నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అడవి బిడ్డలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి సముచిత స్థానమిచ్చి వారి అభివృద్ధికి పలు పథకాలు అమలు చేశారని, అనంతరం వైఎస్సార్‌ బిడ్డగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కూడా గిరిజనులకు సంక్షేమ పథకాలు అందించి, ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గిరిజన ముద్దుబిడ్డగా బిర్సాకు గుర్తింపు ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలోనే జడ్పీటీసీ అత్యంత భారీ మెజార్టీ సవర చంద్రమ్మ విజయం సాధించడం చరిత్రాత్మకమన్నారు. మందసలో త్వరలోనే గిరిజన భవనాన్ని పూర్తి చేస్తామన్నారు. 60 ఏళ్ల పరిపాలించామని చెప్పుకుంటున్న నాయకులు తమ గిరిజన ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని జెడ్పీటీసీ సవర చంద్రమ్మ అన్నారు. వైఎస్సార్‌, ఆయన కుమారుడు జగన్‌ అధికారంలోకి వచ్చాకే గిరిజనులకు న్యాయం జరిగిందన్నారు. గిరిజనుల కష్టాలను మంత్రి అప్పలరాజు పరిష్కరిస్తున్నారని చెప్పారు. సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్‌ఓఆర్‌ ద్వారా గిరిపుత్రులకు పట్టాలు ఇవ్వనున్నామన్నారు. అనంతరం నిర్వహించిన గిరిజన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, కుంటికోట, వీజీపురం సర్పంచ్‌లు దుంపల లింగరాజు, కర్రి గోపాలకృష్ణ, వైస్‌ ఎంపీపీలు సీర ప్రసాద్‌, కొర్నాని ఆదినారాయణ, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, డిప్యూటీ డైరెక్టర్‌ జి.మంగవేణి, ఏటీడబ్ల్యూఓ మేడిద శ్రీనివాసరావు, ఈఈ కె.సింహాచలం, డీఈ వంగపండు శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, జేసీఎస్‌ కన్వీనర్‌ చింతాడ గణపతి, ఏపీఓ గొడబ ప్రసాదరావు, కో ఆప్షన్‌ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్‌, గిరిజన సర్పంచ్‌, ఎంపీటీసీ, గిరిజన నాయకులు, వివిధ మండలాల అధికారులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.